# దాడి

గోడ మీద ఫొటో.

ఆ ఫొటోపట్ల ఉత్సాహం, ఉత్సుకత కనబరిచింది ఫాతిమా.

కొత్తకోడలు ఆ ఫొటో గురించి పట్టించుకోవడం చూసి చకితురాలైంది జరీనా బేగం.

కోడలు అంటే తనకు ఇష్టం. తను అడుగు పెట్టిన తర్వాతే ఈ ఇంటికి ఒక కళ, తేజస్సు, చైతన్యం వచ్చేయని భావిస్తుంది జరీనా.

కొడుకు, కోడలూ ఇద్దరూ ఉద్యోగస్తులే.

తనకు అంతో, ఇంతో అందుబాటులో ఉండేది ఒక్క కోడలే.

అన్వర్ కొడుకు కాదు. ఒక యంత్రం. ఇంట్లో ఉండేది తక్కువ. బయట తిరిగేది ఎక్కువ. ఒక్కటే హడావుడి. ఏమిటో ఉరుకులు, పరుగులు. అదేమి మాయదారి ఉద్యోగమో ఇంట్లో ఉన్నప్పుడైనా స్థిమితంగా ఉండడు. సెల్‌ఫోన్‌కి అతుక్కుపోతాడు. ఆ మాత్రానికి ఇంటికి రావడం ఎందుకూ? చివరికి భోజనం చేస్తున్నప్పుడు కూడా సెల్. తృప్తిగా భోజనం చేయడు. తృప్తిగా మాట్లాడడు... తన ముద్దుల కన్న కొడుకు.

రోజూ కొడుకుని చూసుకొని మురిసిపోవాలే తప్పా మాటా, పలుకు ఉండదు.

'ఒరే నెలకొక్కసారైనా ఈ తల్లితో మాట్లాడు' అని అడిగితే –

సోగ్గా, భుజాలు ఎగరేస్తూ 'ఏమిటి మాట్లాడాలి?' అంటాడు అన్వర్.

అవును అమ్మతో ఏమి మాట్లాడుతావ్? మాటలంటే వ్యాపారం, మాటలంటే వ్యవహారం, మాటలంటే మనీ మేకింగు.

అమ్మే కాదు, మనుసులు, మమతలు, అనురాగాలు, ఆత్మీయతలు అనేవి గుండెలోంచి వస్తాయనే విషయం మర్చిపోయేడు కొడుకు. పక్కనున్న మనుషుల్ని పట్టించుకోడు. ఎదురుగా ఉన్న వస్తువుల్ని ప్రేమిస్తాడు. వస్తు వ్యామోహంతో ఆ ప్రపంచంలో మునిగితేలుతాడు.

అంచేతనే గోడ మీద ఫొటో విషయమై తల్లితో గొడవ పడ్డాడు.

అద్భుతంగా ఇంటీరియర్ డికరేషన్ చేయబడిన హాలులో, దిష్టి బొమ్మలా వేలాడుతున్న ఆ ఫొటోను తీసిపారేయమంటాడు. జరీనా ఒప్పుకోదు.

'అతిథులు ఎవరైనా ఇంటికి రాగానే ముందుగా ప్రత్యక్షమయ్యేది హాలు. అందంగా ఉండొద్దూ. అసహ్యంగా ఆ ఫొటో ఏమిటీ' అంటారు అన్వర్.

జరీనాకి అన్వర్‌పై కోపం.

వాడికి మనుషుల గొప్పతనాలు, త్యాగగుణాలు అక్కరలేదు. మానవ సంబంధాలన్నీ వస్తుసంబంధాలుగా రూపాంతరం చెందుతూ పోవడాన్ని ప్రత్యక్షం గా కొడుకు ద్వారా చూస్తోంది. అయితే కొత్త కోడలు ఫాతిమాను చూసేక, మనుషుల మధ్య ప్రేమానుబంధాలు, అభిమానాలు, అనురాగాలు ఇంకా ప్రపంచం లో మిగిలివున్నాయనే భావనతో ఊరట.

గోడకు వేలాడుతున్న ఆ పాత ఫొటోతో తనకున్న అనుబంధమేమిటో కోడలు అడిగి తెల్సుకునే ప్రయత్నం చేయడం జరీనాకు ఆనందాన్ని కలిగించింది.

కోడలు ఫాతిమాని ఆత్మీయంగా దగ్గరకు తీసుకుంది. పాతికేళ్ళ వెనక్కి గతంలోకి వెళ్లింది జరీనా. నిన్న మొన్న జరిగినట్టు అంతా గుర్తు తనకు.

***

కటిక చీకటి.

కర్ఫ్యూ పడగ నీడ.

జరీనాను తరుముతూ దుండగులు.

దుండగులకు అందకుండా జరీనా పరుగులు.

ప్రాణభయం. పరిగెట్టే శక్తి లేదు. రోడ్డు పైనుంచి ఒక సందులోకి తిరిగింది. ఒక ఇంటి తలుపులు తట్టింది.

తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయి.

జరీనా బాణంలా లోపలికి దూసుకుపోయి, తనే తలుపులు వేసేసింది.

ఎదురుగా స్వామిజీ!

చేతులెత్తి దండం పెట్టింది.

తనని తోడేళ్లు తరుముతున్న విషయం తెలియజేసి ఆశ్రయం కోరింది.

ముఖమైనా కన్పించని వస్త్రధారణ. పూర్తిగా బురఖా.

అడిగి లోపలికి రాకుండా, లోపలికి వచ్చేసి, తలుపు గెడ వేసేసి ఆశ్రయం అడుగుతోంది. అదీ ఒక హిందూని. అదేమి సంస్కారం?

స్వామీజికి ఒళ్లు మండి, ఆశ్రయం ఇవ్వలేనని గట్టిగానే చెప్పి, బయటకు పొమ్మన్నాడు.

చేతులు జోడించి, జరీనా తలుపు వద్ద నుంచి కదలలేదు.

తను అయ్యప్ప మాల వేసుకోకుంటే, ఆమెను తాకి, బయటకు నిర్దాక్షిణ్యంగా తోసేయగలడు ముప్పయి మూడేళ్ల బ్రహ్మాజి.

ఆ సమయంలో దుండగులు తలుపుతడితే ఆమెను వాళ్ళకి అప్పగించేయ డానికి సిద్ధంగా ఉన్నాడు. దుండగులు దారి తప్పేరా? వస్తే బాగుణ్ణు.

అతనివి నల్ల బట్టలు.

ఆమెవి నల్ల బట్టలు.

"వెళ్లు మాతా" –కోపంగానే అరిచేడు.

వెళ్ళదు.

"నేను కఠోరవ్రతంలో ఉన్నాను. ఆడగాలి నాకు తగలరాదు. దయచేసి వెళ్ళిపో"

ఆమె వెళ్ళదు.

"స్వామీ. మంచినీళ్ళు"

ఆమె ప్రార్థన!

ఎంతటి కఠినాత్ముడైనా కాదనలేడుగా.

లోపలికి వెళ్ళి చెంబుడు నీళ్ళు, గ్లాసుతో వచ్చేడు బ్రహ్మాజి.

ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఊపిరి ఆడకుంటోంది. స్నానం చేసినట్లు ఆమె ఒళ్లంతా చెమట.

పూర్తిగా తడిసిపోయి, చికాకుని కల్గిస్తున్న బురఖాను తీసేసింది. తీయకుండా ఉండలేక పోయింది.

బురఖా నుంచి బయటపడిన ఆమె అందాన్ని చూసి నిర్ఘాంతపోయేడు... నీళ్లతో అప్పుడే వచ్చిన బ్రహ్మాజి.

నల్లమబ్బుల నుంచి బయటపడ్డ బంగారు తీగ. మధుమాసపు పూర్ణచంద్రిక. అద్భుత, అపూర్వ సౌందర్యం!

బురఖా కుబుసం విడిచిన బిగి - నవ యవ్వనం. ఉజ్వల తేజస్సుతో మెరిసిపోతోంది.

చెమటతో తడిసిన ఆమె ముఖారవిందం మంచులో తడిసిన ఒక ముద్దబంతి పువ్వు.

నల్లటి తెర వెనుక... తను తట్టుకోలేనంతటి అపురూప సౌందర్యం, బంగారు లావణ్యం!

"స్వామీ మంచినీళ్లు"

తేరుకున్నాడు స్వామి.

స్వామియే మంచినీళ్లు తాగే స్థితిలో ఉన్నాడు.

తను స్వామినన్న విషయం కూడా మరిచిపోయి ఉన్నాడు.

జరీనా గ్లాసుతో కాకుండా, చెంబుతోనే ఆ చెంబుడు నీళ్లు ఎత్తిపట్టుకుని గడగడ తాగేసింది. శరీరం శాంతించింది. ఉపశమించింది.

కృతజ్ఞతలు తెలిపింది.

నీళ్లు తాగి బయటకు వెళ్ళిపోలేదు ఆమె.

అతని పాదాలపై పడిపోయింది (ముట్టుకోకుండా).

తనకు ఆశ్రయమిచ్చి పుణ్యం కట్టుకోమని కన్నీళ్లతో ప్రార్థించింది పదేపదే. అప్పటికే ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయిన బ్రహ్మాజి అసంకల్పితంగా ఆమెకు ఆశ్రయం ఇచ్చేశాడు.

ఆశ్రయం ఇచ్చినట్లు తనకే తెలీని ఒక అద్భుత స్థితి.

ఇంటిలోపలికి తీసుకువెళ్లేడు. ఒక గది చూపించేడు.

ఆ గది తన బెడ్‌రూం. భార్యతో కలిపి పడుకునే గది.

భార్యతో కలిసి పడుకోకూడని వ్రతంలో ఉన్నాడు గనుక... అతని వద్ద భార్య లేదు. ఇద్దరు చంటిపిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది.

ఆమె గత రెండేళ్లు ఈ విధంగానే వెళ్లిపోవడం జరిగింది.

నలభై రోజులు తన భర్తకి ఆడగాలి తగలకూడదు. మగగాలి తనకు తగలక పోయినా తట్టుకుని ఉండగలిగే శక్తి ఉంది. కాని ఆ నల్లబట్టలు వేసుకున్నన్ని రోజులు పెళ్లాన్ని 'మాతా' అని పిలుస్తాడు. అది భరించలేకే పుట్టింటికి

పారిపోతుంది ఆ ఇంటి ఇల్లాలు.

ఇల్లాలు లేకపోవడంతో ఏక్ నిరంజన్‌లా ఒక్కడే ఉంటున్నాడు అతడు.

బయట చీకటి కర్ఫ్యూ.

లోపల వెన్నెల దేవత.

ఒక గంట పోయేక, జరీనా గదిలోంచి బయటకు వచ్చి, "స్వామీ! ఆకలి" అంది.

బ్రహ్మాజి భార్య పుట్టింటికి వెళ్లిపోయేక వంట బంద్. స్టౌ వెలిగించి కనీసం టీ పెట్టుకోవడం కూడా చేతకాని మగమహారాజు అతడు. నగరంలో కొన్ని హోటళ్లు స్వాముల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు తెరుస్తారు. కర్ఫ్యూ గొడవ లేకుంటే, ఎంచక్కా అక్కడికే వెళ్లేవాడు. లేకుంటే ఈపాటికి ఏదొక చోట అంబలం పూజ ఉండేది. ఆ పూజ వద్దకు వెళ్లి, ప్రార్థన చేసి, కైంకర్యం అరగించి, ఏ అర్ధరాత్రో ఇంటికి చేరేవాడు.

జరీనాకు ఆ విషయం తెలియజేసి, ఆమె చేతిలో రెండు పళ్లు పెట్టి, వాటితో సరిపెట్టుకోమని సలహా ఇచ్చేడు బ్రహ్మాజి.

పళ్లు తీసుకుని, తలుపులు వేసుకుంది జరీనా.

హాలులో కటిక నేలపై పడుకున్నాడు బ్రహ్మాజి.

అతనికి ఇదంతా ఒక కలలా కన్పిస్తోంది. తనని ఆవహించిన ఏదో తిమిరి వదిలి, నేలపై నిలచి ఆలోచిస్తుంటే... తను ఒక ముస్లిమ్ స్త్రీకి ఆశ్రయం ఇవ్వడం అమితమైన ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

అతనిలో కొంతలో కొంత మత విద్వేషపు భావజాలం లేకపోలేదు. ఆ భావజాల బీజాలకు మూలాలు, ప్రత్యేక కారణాలు అంటూ స్పష్టంగా ఏమీ లేవు. తను పెరిగిన పరిసరాలు, పుస్తకాలు, స్నేహితుల ప్రభావం కొంత ఉంటే ఉండ వచ్చుగాక. ప్రస్తుతం నగరాన్ని భగ్గున్న మండిస్తున్న మత చిచ్చు అతనిలో అసహనానికి ఆజ్యం పోసినట్టు ముస్లిమ్ ద్వేషం.

అయితే ఆచరణలో చేసిందేమిటి?

ముస్లిమ్ స్త్రీకి ఆశ్రయం!

తనలో చిరాకు, చికాకు. అస్థిమితం. ఆందోళన.

ఆమె అందం తనని దెబ్బ తీసిందా?

అయిందేదో అయింది. దుండగులు ఆమెను వదిలేస్తారని తను భావించడం

లేదు. వాళ్లు ఏ క్షణంలోనైనా తలుపు తట్టకపోరు. ఆమె తప్పించుకుపోలేదు – అనుకోవడంతో నిద్ర పట్టింది బ్రహ్మాజికి.

అతడు ఉదయం నాలుగ్గంటలకి లేవవలసినవాడు లేవలేదు.

జరీనా లేచింది.

అతణ్ణి (అంటుకోకుండానే) లేపింది.

తుళ్లిపడి లేచేడు.

ఆమెను చూసి నివ్వెరపోయేడు. ఆశ్చర్యచకితుడయ్యేడు.

ఆమె ముస్లిమ్ స్త్రీలా లేదు.

మహాలక్ష్మిలా ఉంది.

స్నానం చేసి తలారబెట్టుకొని, సిల్కుచీర కట్టుకుని, నుదుట బొట్టు, చేతి గాజులతో, ముగ్ధమనోహరంగా, మందస్మిత వదనంతో నించుంది.

హిందూ సంస్కృతి ఆమెలో ప్రవహిస్తోంది!

ఆమె ఉంటున్నది విశాఖపట్నంలో. హిందూ కుటుంబాల మధ్య. ఇరుగు పొరుగు, ఆమె స్నేహితులంతా హిందువులే. ఆమెకు చీర కట్టుకోవడం ఇష్టం. నుదుట బొట్టుపెట్టుకోవడం ఇష్టం. చేతులకు నిండుగా గాజులు ఇష్టం. తలలో పూలు ఇష్టం. మంగసూత్రం కూడా ఇష్టం. ఆమె వివాహం ముస్లిం సంప్రదాయం ప్రకారమే జరిగినప్పటికీ, సరదాపడి భర్తతో తాళి కట్టించుకుంది. ఆమె వివాహానికి అత్యధికులు వచ్చింది హిందువులే.

ఆమెకు అయ్యప్ప దీక్షకు సంబంధించిన విషయాలు అన్నీ తెల్సు. ఎదురింటి రామారావు అయ్యప్ప మాల వేసుకుంటాడు. అంతేకాదు సమస్త హిందూ పండగలు, తీర్థాలు ఆస్వాదిస్తుంది. తనూ పాలుపంచుకుని ఆనందిస్తుంది.

ఆమెకు శివరాత్రి అంటే ఎంతో సరదా. ఇరుగుపొరుగుతో కలిసి జాగరణ చేస్తుంది. ఉదయం నలుగురితో కలిసి వెళ్లి సముద్ర స్నానాలు చేస్తుంది. ఆ పండగంటే ఎంత ఇష్టమో!

సంప్రదాయం వివిధ రూపాలలో మానవ సముహాల మధ్య జీవిస్తూ వుంటుంది. వేడుకలకి, పండగలకి, ఉత్సవాలకి ఊరేగింపులకి సంగీత సాహిత్యాల కి వివిధ కులమతాలకి సంస్కృతీ సంప్రదాయాలు ముడిపడి ఉంటాయి. అవి సాగే కాలంతో బాటు మార్పులకు లోనవుతుంటాయి. కొందరు ఛాందసులు అప్పుడెప్పుడో ఏర్పడిన పాతవాటినే పట్టుకు వేలాడటంతో ఘర్షణకు, విద్వేషాలకు లోనవుతారు.

అసలు సంస్కృతీ సంప్రదాయాలంటే ఏమిటో జరీనాకు తెలీవు. ఒక పద్ధతిలో సాగిపోతున్న జీవన సంస్కృతిలో కలిసిపోవడమే ఆమెకు తెల్సు. మత సంస్కృతి కన్నా చిత్త సంస్కృతే ఆమెను ముందుకు నడిపిస్తుంది.

అయ్యప్ప దీక్ష విధానాలన్నీ ఆమెకు సమగ్రంగా తెల్సు. అంచేత వేకువ జామునే స్వామి పూజకు కావలసినవన్నీ సమస్తం సమకూర్చింది.

కైంకర్యం సిద్ధం చేసింది.

బ్రహ్మాజి నిద్రలేచి, స్నానం చేసి పూజను కానిచ్చేడు. ఆ తరువాత ఉల్లి, వగైరాలు లేకుండా పద్ధతిగా, రుచిగా చేసిన సిద్ధి (కైంకర్యం) తృప్తిగా తిని, హాయిగా త్రేన్చేడు.

ఆమె కష్టపడి పనసపండు ఒలిచి, శుభ్రంగా పనస తొనలు ప్లేటులో పెట్టి ఇచ్చినంత తృప్తిగా వుంది అతనికి.

ఆమె అటూ ఇటూ కలివిడిగా తిరుగుతుంటే ఏటి మీదకు వెన్నెలొచ్చినట్లు ఇల్లు తళుకులీనుతోంది. నిర్జీవమైన గోడలు చైతన్యదీప్తితో శోభిస్తున్నాయి. ఆమె మసులుతున్న చోటల్లా ఒక మధురమైన పరిమళం పరచుకుంటోంది. ఆమె మాట్లాడినా, నవ్వినా గుడిగంటలు మోగుతున్నట్లు భావన కలుగుతోంది.

వెండి వెన్నెల నింపుకున్న ఆమె దేహకాంతి అతని దీక్షను సవాలు చేస్తోంది. ఆమె అద్భుత సౌందర్యం అతణ్ణి కుదిపేసి కలవరపెడుతోంది.

కర్ఫ్యూ ఉదయం వరకే అన్నది మరో ఇరవై నాలుగ్గంటలు పొడిగింపబడటంతో జరీనా రెక్కలు తెగిన పక్షిలా గిజగిజ లాడింది.

పసిబిడ్డ గుర్తుకొచ్చి ఏడుపొచ్చింది.

'నాకు అమ్మ కావాలి' అని అన్వర్ ఏడుస్తున్నట్టు భ్రాంతికి లోనయింది.

మత కల్లోలంలో, మృత్యుకేళీ వికటాట్టహాసంలో ఎవరికి వినిపిస్తుంది ఆ పసిబిడ్డ ఆర్తనాదం? ఎవరిక్కావాలి, కర్ఫ్యూ బాధితుల ఆప్తజనం పెట్టే శోకం!

తను ఎలా వెళ్లగలదు? బిడ్డ చెంతకు ఎలా వెళ్లగలదు?

నలుమూలల నిరంకుశంగా, నిర్దాక్షిణ్యంగా నరమేధం. రాక్షసత్వం పడగలు విప్పి బుసలు కొడుతోంది. నరవ్యాఘ్రాలు నెత్తుటేళ్లు పారిస్తూ, ఘోరకలి సాగిస్తున్నాయి.

జరీనా ఏడుస్తుంటే చిరాకుపడలేదు బ్రహ్మాజి. ఆమెలో ధైర్యం నింపే ప్రయత్నం చేసేడు. ఇంటి ధ్యాస నుంచి ఆమెను మరల్చడానికి ఎన్నెన్నో కబుర్లు చెప్పేడు. తన కుటుంబ విషయాలు చెప్పేడు.

అలాగే ఆమె కుటుంబ విషయాలు అడిగేడు.

ఆమె చెప్పింది.

తను విశాఖపట్నంలో ఒక ఎలిమెంటరీ స్కూలు టీచరు. పెళ్ళయింది. మూడేళ్ల బిడ్డ, పేరు అన్వర్. అన్వర్ పుట్టేక మరిక సంతానం కలగలేదు. కాని కడుపునొప్పి మొదలయింది. ఆ నొప్పి తరచుగా వస్తూ సూదులతో పొడుస్తున్నట్లు, కాల్చిన కడ్డీతో వాతలు పెడుతున్నట్టు చిత్రహింసతో, విపరీతమైన బాధతో మెలికలు తిరిగిపోయేది.

ఎంతమంది డాక్టర్లకు చూపించినా తగ్గలేదు. నొప్పి తగ్గడానికి ఎవరు ఏమి చెబితే అది చేసేది. ఏవేవో మందులు మింగేది. ఎవరో చెబితే బిక్కవోలు గ్రామానికి బస్సెక్కి వెళ్లి, శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చుట్టూ నాగుల చీర ధరించి నూటొక్క ప్రదక్షిణలు చేసింది. ఇలాంటివి ఎన్నెన్నో చేసింది. చివరికి తట్టుకోలేక, నూతిలో దూకి ఆత్మహత్య చేసుకోబోయింది. బిడ్డ అదృష్టం. బతికి బయటపడింది.

ఆ స్థితిలో, ఆమె కొలీగ్ శారదా టీచర్ హైదరాబాద్‌లో ఒకమంచి ఆయుర్వేద వైద్యుడు ఉన్నాడని చెప్పి, తనే స్వయంగా తీసుకు వెళ్లింది. అదృష్టవశాత్తు ఆ వైద్యం తనకు పనిచేసింది. క్రమక్రమేణ నొప్పి తగ్గి ఉపశమనం కలిగింది.

మందులు మూడు నెలలకే ఇచ్చేడు వైద్యుడు. ఆ మందులు వాడి తర్వాత చెకప్‌కి రమ్మన్నాడు.

చెకప్‌కి వచ్చింది హైదరాబాద్. అన్వర్‌ను తల్లి వద్ద వుంచింది. ఆయుర్వేద వైద్యుడి వద్దకు వెళ్లి, ఇచ్చిన మందులు తీసుకుని, వైజాగ్ బయల్దేరుతూ కర్ఫ్యూ కోరల్లో ఇరుక్కుపోయింది. దుండగులు దాడిచేస్తే రోడ్డుపై పరుగులెత్తింది.

"దేవుడిలా మీరు నాకు ఆశ్రయం ఇచ్చేరు. మీరు దయతో నాకు ఆశ్రయం ఇవ్వకుంటే నా బతుకు కుక్కలు చింపిన విస్తరాకు అయ్యేది. నన్ను నానా విధాల చిత్రహింసలు పెట్టి, ఒకరు తర్వాత ఒకరు కిరాతకంగా అత్యాచారం జరిపి, కత్తులూ కటారులతో నన్ను పొడిచి చంపేసేవారు.మీ రుణం తీర్చుకోలేనిది" అంటూ చేతులెత్తి నమస్కరించింది జరీనా.

"ఇంత దూరప్రయాణం ఒక్కదానివి కాకుండా... మీ ఆయనతో కలిసి చేయవచ్చు కదా" అన్నాడు బ్రహ్మాజీ.

"నా మొగుడు అంతటి వాడు కాదు. నాకు కావల్సింది ఏదీ అతను చూడడు, చేయడు. అతనికి కావల్సిన సమస్త అవసరాలు నేనే సమకూర్చాలి. లేకుంటే

కొడతాడు, తిడతాడు. మున్సిపల్ ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి తినడం, తాగడం తప్పా మరో పని చేతకాదు" అన్నది జరీనా.

మూడునెలల క్రితం తను ఈ నగరం వచ్చినప్పుడు ఇచ్చటి జనాలు శాంతి కపోతాలు, ప్రశాంతతకు రూపాంతరాలు. ఈరోజు అనూహ్యమైన మత విద్వేషపు భయానక భీకరగాడ్పులు. భీతితో, భయోద్విగ్నతతో అల్లల్లాడిపోతున్న అభాగ్య నగరం.

మతకలహానికి కారణాలు ఆమెకు తెలియదు. తెల్సుకోవాలనే కుతూహలమూ, ఉత్సాహము లేదు. కారణాలు అనేవి ఆకాశం నుంచి ఊడిపడవు. మత కలహాలు ఒక తుపాను, భూకంపాల్లా ప్రకృతి వైపరీత్యాలు కావు. కలహాలు నిర్మితము. భావోద్వేగ కారణాలు కల్పితము. కలహ కారకులు ఒక పదిమంది లేదా వంద మంది. బాధితులు మాత్రం కోట్లాది అమాయక ప్రజలు అన్న విషయం ఆమెకు తెల్సు.

తను ఇక్కడ చిక్కుకుపోయి మూడు నాలుగు రోజులు అవుతున్నది. శాంతి భద్రతల కోసం పొడిగింపబడుతున్న కర్ఫ్యూ యధాప్రకారం వృధాగానే మిగిలి పోతున్నది. గుండా, తండాల ఘోరకలి. అదుపులోకి రాని అశాంతి. ఏ మాత్రం సడలని ఉద్రిక్తత. శాంతి అంచులు కనిపించని భద్రత. పోలీసు వ్యవస్థలో నిర్వీర్యత. ప్రభుత్వ నేతల నిర్లిప్తత.

ఆ పరిస్థితుల్లో ఒక ముస్లిమ్ యువతి హిందూ ఇంట్లో ఆశ్రయం పొంది మూడు నాలుగు రోజులుగా ఉండగలగడం దుస్సాహసమే. జరీనా కావాలని బ్రహ్మాజి ఇంటికి రాలేదు. ఆపదలో ఒకసాటి మనిషిని ఆశ్రయించింది. ఆశ్రయం ఇచ్చినవాడు మాల వేసుకున్న స్వామి. దేవుడి చెంతనున్నందున తనకెలాంటి భయమూ లేదు. తను ఎదురుచూస్తున్నది కర్ఫ్యూ ఎత్తివేత కోసం. కర్ఫ్యూ గేట్లు తెరవగానే రైలెక్కేస్తుంది?

అప్పటికింకా ఎలక్ట్రానిక్ మీడియా, సెల్‌ఫోన్ కల్చరు ఆ నగరంలోకి చొచ్చుకురాలేదు. టీవి వచ్చినప్పటికి ఇప్పటిలా విజృంభించలేదు. రేడియో వార్తలే ఆధారం. ఆ రోజుల్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు కూడా దిగువ మధ్యతరగతికి అందుబాటులో లేనివే. అటు జరీనాకుగాని,ఇటు బ్రహ్మాజికి గాని ఫోన్లు లేవు. వైజాగ్‌కి మనిషి గాని, మాటగాని చేరలేని దుస్థితి.

ఈ కత్తుల కర్ఫ్యూ బోను నుంచి బయటపడేదెప్పుడని ఎదురుచూస్తోంది జరీనా.

బ్రహ్మజి ప్రభుత్వ ఉద్యోగి. ప్రయత్నిస్తే కర్ఫ్యూ పాస్ పొందవచ్చు. కాని తలుపులు తెరచి బయటకు తొంగిచూసే ప్రయత్నం చేయలేదు. ఆమెను కూడా చేయనివ్వలేదు.

జరీనా పుణ్యమా అని ఆగని పూజలు, సర్ది, బిక్ష, కైంకర్య ఫలహార భోజనములు, ఎప్పటికప్పుడు సవ్యంగా సమయానికి అమరిపోతుంటే అతనికేమి నొప్పి? బయటకు పరుగులేల?

***

రాత్రి ఎనిమిది గంటలప్పుడు, పిడుగులు పడినట్లు ఇంటి తలుపులపై పెను చప్పుడు. ఆ చప్పుడులో మృత్యు ఘంటికలు మ్రోగుతున్నాయి.

ఎవరా నరరూప రాక్షసులు?

ముస్లిమ్ ముష్కరులా?

హిందూ దుండగులా?

తన పక్కనే ఉన్న జరీనాకు ఏ జాగ్రత్తలూ చెప్పలేదు బ్రహ్మజి.

నెమ్మదిగా వెళ్లి తలుపులు తీసేడు.

జరీనా పారిపోయి ఏ మూలనో దాక్కోలేదు. ఏమి చేయాలో తోచలేదు. అదే మంచిదయింది.

దుండగుల్లో ఒకడు బయట కాపలా వుండగా, మిగతా వాళ్లు కత్తులూ, కటార్లతో లోపలికి దూసుకువచ్చేరు.

బ్రహ్మజి, జరీనా హాలులోనే ఉన్నారు. దుండగులు మొత్తం ఇల్లంతా వెతికి చిందరవందర చేసేశారు.

తర్వాత, బ్రహ్మజి వద్దకు వచ్చి, చూపులతో కాల్చేసేలా చూస్తూ, "నీవో తురక ముండకి ఆశ్రయమిచ్చేవని మా అనుమానం. ఆ ముండ ఎక్కడ?" అని గర్జించేరు.

"నేనెవరికీ ఆశ్రయమివ్వలేదు స్వామీ" అన్నాడు బ్రహ్మజి సౌమ్యంగా.

వాళ్లు నలుగురు దుండగులు.

స్వామి మాట నమ్మి, వెళ్లిపోతూ ఆ నలుగురిలో ఒకడు వెనుతిరిగి, మళ్లీ స్వామి వద్దకు వచ్చేడు.

ఆ దుండగుణ్ణి ఒకసారి చూస్తే చాలు కలలోకి వస్తాడు. గుర్తుండిపోతాడు. అతడి ఒళ్లంతా పాండు రోగము లాంటి తెల్లదనం. తెల్లటి ముఖంలో నల్లగ

మసూచికపు మచ్చలు. గద్దలాంటి పెద్ద ముక్కు. బండ పెదవులు. నున్నగా గుండు.

వాడిని చూడగానే గుర్తుపట్టింది జరీనా.

వాడూ జరీనాను గుర్తుపట్టేడా?

కాని జరీనా చూడ్డానికి నూటికి నూరుపాళ్లు హిందూ స్త్రీలా కన్పిస్తోంది.

"ఈమె ఎవరు?" అని అడిగేడు గద్దముక్కు గుండుగాడు... మర్యాదగానే.

"నా భార్య స్వామీ" అన్నాడు బ్రహ్మాజి అంతే మర్యాదగా.

గుండుగాడు అనుమానంగా చూసేడు – "ఎలా నమ్మమంటావ్?"

బ్రహ్మాజీ తన మెడలో రుద్రాక్షమాలను పట్టుకుని, అయ్యప్పస్వామిపై ప్రమాణం చేసి "ఆమె నా భార్య" అని నొక్కి చెప్పేడు మరోసారి.

గుండుగాడి అనుమానం తీరిందో లేదోగాని బయట కాపలా ఉన్నవాడు పోలీసు జీపు వస్తోందని హెచ్చరించడంతో గుండుగాడితో సహా దుండగుల సమూహమంతా ఉడాయించేరు.

జరీనా బురఖా వేసుకోకపోవడం ఆమెను రక్షించింది.

దుండగులు వెళ్లిన వెంటనే, ఆమె మోకాళ్లపై వంగి, బ్రహ్మాజి పాదాల ముందు కృతజ్ఞతా భావంతో శిరస్సు వంచి, రెండు చేతులతో వినమ్రంగా దండం పెట్టింది. ఆమె కళ్లు జలపుష్పాలయ్యేయి. ఆమె గుండెలు గుడి గంటలయ్యేయి.

"స్వామీ! మీకు ఏమీ కాని ఒక పరాయి స్త్రీని రక్షించడానికి మీరు ఒక కఠోరదీక్షలో ఉండి కూడా ఒక పెద్ద అబద్ధం చెప్పేరు. ప్రాణవిత్త మానభంగమందు బొంకవచ్చు అన్నారు పెద్దలు. ఆపదలో ఉన్నవారు బొంకాలి అంటే నేను బొంకాలి. కాని నా కోసం మీరు బొంకేరు. అసత్యం ఒకొక్కసారి సత్యం కన్నా గొప్పదనే సత్యం ఇపుడు నాకు బోధపడింది. అనుభవమయింది. అయితే స్వామీ! మీ దీక్ష భగ్నం కాలేదనే నేను భావిస్తున్నాను. మీరే దేవుడు. దేవుడే మీరు. ఒక చెడ్డ కర్ఫ్యూ ఒక మంచి స్వామిని దర్శింపజేసింది. ఏ అత్యాచారానికో, హత్యకో గురి కాకుండా నన్ను కాపాడి ఒకరకంగా నాకు మరో జన్మనిచ్చిన మీకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలను స్వామీ" అంది జరీనా.

"ఈ రాత్రి నీ శరీరం, నీ యవ్వన సంపద నాకు కైంకర్యంగా సమర్పించి" అంటూ ఆమె తన రుణం తీర్చుకునే విధము స్పష్టం చేసి ఆమె దిగ్భ్రమ నుంచి తేరుకునేలోగానే అక్కడ నుంచి అదృశ్యమయ్యేడు ఆమె దేవుడు బ్రహ్మాజి!

***

చేష్టలుడిగి కొయ్యబారిపోయింది జరీనా.

ఎదురుగా కన్పిస్తున్నదంతా శూన్యం.

తన చుట్టూ వినిపిస్తున్నదంతా నిశ్శబ్దం.

ఆమె అంతరంగ సముద్రమంతా అల్లకల్లోలం.

గదిలోకి వెళ్లిపోయి చాలాసేపు పెనుదుఃఖంలో మునిగిపోయింది. తర్వాత... ప్రక్షాళన చెందినట్లు దుఃఖసముద్రంలోంచి బయటకొచ్చింది. కళ్లు తుడుకుకొని గదిలోంచి బయటకు వచ్చి బ్రహ్మాజి ఎదురుగా నించుంది.

స్వామి కోరికను మన్నిస్తూ కొన్ని సవరణలతో అతని ముందు ఉంచింది.

"స్వామీ మీరు నన్ను కోరేరు. అయితే నాదొక ప్రార్థన. చిన్న సవరణ. నా వల్ల మీ దీక్ష దెబ్బ తినగూడదు. మీరు కఠినమైన నియమనిష్టలతో, మహత్తరమైన దీక్షలో ఉన్న స్వామి. నేను – చెప్పాలంటే, మీకు అర్పించే కైంకర్యంలో ఉండగూడని చిన్న ఉల్లి తొక్కను.

నా ప్రార్థన ఏమిటంటే మీరు ముందుగా దీక్ష పూర్తిచేసి, శబరిమలై వెళ్లిరండి. మీరు తిరిగి వచ్చిన వెంటనే నా యాభై నాలుగు కేజీల శరీరం పళ్లెంలో మీ కోసం పంచభక్ష్య పరమాన్నంలా సిద్ధంగా ఉంటుంది. ఇది నేను దాటేయడానికి అనడం లేదు. నా బిడ్డపై ప్రమాణం చేసి చెబుతున్నాను.

నన్ను అర్థం చేసుకోండి. నా బాధ ఏమిటంటే నన్ను దుండగుల నుంచి కాపాడిన స్వాములను చూస్తూ, చూస్తూ ఎలా భ్రష్టుపట్టించగలను? మీ అకుంఠిత దీక్షను, వ్రతాన్ని ఎలా భగ్నం చేయగలను?

నాకు తెల్సు మీరు మంచివారు. నా యవ్వనమే చెడ్డది. ఈ గోడల మధ్యనున్న ఏకాంతం, నా యవ్వనంతో జతకూడి మీపై దాడిచేసింది. నా రూప లావణ్యం, సౌందర్యం ఒక పెట్రోలు మంటలా జ్వలింపజేసి మిమ్మల్ని దహించి వేసింది. కాని తుచ్ఛశరీరం మీ పవిత్ర దీక్షను జయించరాదు. నా ప్రార్థన ఏమిటంటే ఈ దేహం మీదే. దేహం కోసం దీక్షను వదిలేయవద్దు. దేహం. దీక్షా రెండూ పొందండి. అయితే ముందుగా దీక్ష. ఆ తర్వాతే ఈ దేహం. అంచేత మీ కోరికను ఈ అమావాస్య చీకటి నుంచి ఒక చల్లని పున్నమి రేయికి వాయిదా వేయమని వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. అనుగ్రహించండి స్వామీ" అన్నది జరీనా.

బ్రహ్మాజిలో అసహనం. అణుచుకుంటున్న కొలదీ అతణ్ణి దహించి వేస్తున్న అపురూప, మహాద్భుత సౌందర్య జ్వాల. ఆ మండే జ్వాలలో తను శలభమయితేనే శాంతి.

"నేను కోరుకున్నది నీ అధిక ప్రసంగం కాదు. నీ సుందర శరీరం. నన్ను ఉపశమింపచేయడమే నీ తక్షణ కర్తవ్యం. మరిక మాట్లాడకుండా, మరింత జాప్యం చేయకుండా నా దేహాన్ని శాంతింపచేయి. స్నానం చేసి ఒక అయిదు నిమిషాలలో వస్తాను. నేను వచ్చేటప్పటికి ఆ గదిలో మంచంపై నువ్వు సిద్ధంగా ఉండాలి" అని ఆదేశించి, బాత్రూం వైపు నడిచేదు బ్రహ్మాజి.

జరీనా భయకంపితురాలైంది.

నెమ్మదిగా గదిలోకి వెళ్లిందిగాని కాసేపటిలో అతనికి కైంకర్యం కావడానికి సిద్ధం కాలేకపోయింది. మనసు తిరగబడుతోంది.

తను చెడి, అతని వ్రతాన్ని చెడపలేదు.

ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయట పడాలి.

స్వామి తనని తాకేలోపు ఇక్కడ నుంచి అంతర్ధానమై పోవాలి, అదృశ్యమై పోవాలి.

ఎలా?

అతను వచ్చేలోపు ఫేన్‌కి వేలాడి ఆత్మహత్య చేసుకుంటే?

ఆ పాపం అతన్ని చుట్టుకుంటుంది. దీక్షా లేదు. వ్రతమూ లేదు, తన చావుకి అతనే బాధ్యత వహించి, పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వుంటుంది. అది కాదు సరైన మార్గం.

మరేం చేయాలి? ఆలోచించే సమయం లేదు.

ఇందులో ఆలోచించేది ఏముంది?

స్వామికి అందకుండా వెళ్ళిపోవాలి, పారిపోవాలి.

తను తలుపులు తెరచి రోడెక్కితే ఏమవుతుంది?

కర్ఫ్యూ ఉల్లంఘన అంటూ పోలీసులు కాల్చేస్తారా? లేక దుండగులు అత్యాచారం జరిపి, హత్య చేస్తారా? దేనికైనా సిద్ధం. స్వామీజికి మాత్రం తను అందకూడదు.

దేవుడిపై భారం వేసి బ్రహ్మాజి ఇంటి నుంచి తక్షణం పారిపోవడానికి నిర్ణయించుకుంది.

బురఖా ధరించింది.

ఛ! ఈ నాలుగు రోజులు తను బురఖా ధరించి వుంటే ఎంత బాగుణ్ణు. తను బురఖాతోనే అనుక్షణం అతనికి తారసపడివుంటే ఈ యవ్వన పొంగులు, సౌందర్య మెరుపులు రెచ్చగొట్టి దహించే అవకాశం ఉండేది కాదు. అధ్యాత్మిక

చింతన నుంచి ఇలా కామవాంఛతో అధఃపాతాళానికి దిగజారేవాడు కాదు. ఎంత పొరపాటు చేశాను అనుకుంది జరీనా.

సంచి సర్దుకుని గబగబా బయల్దేరబోతూ... ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. పిడుగుపడ్డట్టు.

అనుహ్యంగా, హఠాత్తుగా కత్తిలా దూసుకు వచ్చిన కడుపు నొప్పి!

మందులు వాడగా... పోయిందనుకున్న నొప్పి మళ్లీ జీవం పోసుకుని తిరగబెట్టింది. అయ్యో! ఈ మాయదారి రోగం ఇప్పుడే రావాలా?

ఏమిటీ విపరీతమైన నొప్పి?

కడుపులో ఎవరో కత్తులతో కెలుకుతున్నట్లు మెలికలు తిరిగిపోతోంది. నొప్పి ఆమెను ఎత్తి కుదేస్తోంది. పేగులు సమస్తం పాములై, బుసలు కొడుతూ లోన అడ్డదిడ్డంగా పరుగులు తీస్తూ, చుట్టుకుపోతూ, దొరికిన చోటల్లా కాటేస్తున్నట్టు గిజగిజ గింజుకుపోతోంది. పేగులు ఆక్టోపస్‌లా లోనంతా నులిమేస్తూ, కొరికేస్తూ రక్తం తాగేస్తున్నట్టు అల్లాడిపోతోంది. భరించలేని నొప్పితో చుట్టుకుపోతూ పెనుకేకలు వేస్తోంది.

'ఏ దుండగులో ఈ క్షణం వచ్చి నన్ను పొడిచి చంపేసినా బావుణ్ణు' అనుకుంది.

బ్రహ్మాజి పరుగున లోపలికి వచ్చేడు.

వచ్చేడేగాని అతనికేమి చేయాలో తెలీడం లేదు. తోచడం లేదు. చివరకు ఆమెను ఎత్తుకుని, కర్ఫ్యూ చీల్చుకొని హాస్పటల్‌కి తీసుకువెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

"వద్దు స్వామీ వద్దు. ఏ హాస్పటల్‌కీ వద్దు... అయ్యో నా మతిమండ - మందులు నా దగ్గరే ఉన్నాయి" అన్నది జరీనా.

"ఉంటే ఎందుకు వేసుకోలేదు?"

మర్చిపోయింది. కర్ఫ్యూ బారిన పడి మర్చిపోయింది. ఏ మందుల కోసం ఈ ఊరు వచ్చిందో ఆ మందులు తెచ్చుకున్నదిగాని వేసుకోవడం మర్చిపోయింది. ఏకంగా నాలుగు రోజులు మందులు వాడకపోవడంతో తిరగబెట్టి ఉండాలి జబ్బు.

తన సంచిలో ఒక మందుల డబ్బా బ్రహ్మాజి చేత తీయించింది జరీనా!

మందు పొడరు రూపంలో ఉంది. ఒక చెంచా పొడి గ్లాసు నీళ్లలో కలిపి ఇవ్వమంది. ఇచ్చేడు. తాగింది. తర్వాత ఆ సంచిలో ఒక మూలికను తీయించింది. ఆ మూలికను గరుకునేలపై గంధంలా అరగదీసి, తన పొట్టపై నాభి చుట్టూ రాయమంది.

బ్రహ్మాజి గది నుంచి బయటకు వెళ్లి, అరగదీసిన మూలిక మందుతో వచ్చేడు. అతను బొడ్డు చుట్టూ రాయడానికి సిద్ధపడితే... వద్దని వారించింది. తనే నెమ్మదిగా రాసుకుంటానని చెప్పి... కాసేపు గది బయటకు వెళ్లమంది.

అతడు గది నుంచి వెలుపలికి వచ్చేక, తలుపు గడియ వేసుకుంది. తర్వాత ఆమె తలుపు తెరవలేదు. కాసేపటికి కడుపు నొప్పి తగ్గింది. తగ్గినా తలుపు తెరవలేదు.

తలుపు తట్టి "నొప్పి తగ్గిందా?" అనడిగేడు బ్రహ్మాజి

"తగ్గింది స్వామీ" అన్నది ఆమె.

అవును! అద్భుతంగా కడుపు నొప్పి తగ్గిపోయింది.

"అయితే తలుపు తెరు నా కోరిక తీర్చు" అన్లేదు -

"ప్రశాంతంగా నిద్రపో, గుడ్‌నైట్" అన్నాడు బ్రహ్మాజి

కాని ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోలేక పోయింది. భయం... భయం.

స్వామి ఏ క్షణంలోనైనా, తలుపు తట్టి, లోనకి ప్రవేశించి తనపై అత్యాచారం చేస్తాడేమోనని భయపడింది.

భయంతో అటూ ఇటూ దొర్లుతూ తెల్లవారుజామున ఏ మూడు నాలుగ్గంటలకో నిద్రపోయింది జరీనా.

***

గది తలుపులు దబదబా చప్పుడు.

తుళ్లిపడి లేచింది జరీనా.

సమయం ఎనిమిది గంటల ఇరవైనిమిషాలు. ఏమిటీ నిద్ర!

మళ్లీ తలుపు చప్పుడు.

జరీనా లేచివెళ్ళి తలుపులు తెరిచింది.

ఎదురుగా నవ్వుతూ స్వామి.

నిర్మలంగా, ప్రశాంతంగా, తేజోవంతంగా ఉన్నాడు.

"శుభోదయం" అన్నాడు.

ఆమె నమస్కరించింది వినమ్రంగా

"శుభవార్త"

"ఏమిటి స్వామి"

"మూడు గంటల పాటు కర్ఫ్యూ సడలించేరు. వేగిరం తయారయి, మీ

వూరుకి బయిల్దేరు" అనగానే ఆమెలో అద్భుతానందం. ఒక పారవశ్యం.

చిన్నపిల్లలా ఎగిరి గెంతింది. హాయిగా నవ్వుతూ, చప్పట్లు చరిచింది. హుషారుగా కాలకృత్యాలు తీర్చుకుని, గబగబా తయారయింది.

కర్ఫ్యూ కౌగిట్లో ప్రజలు ఉక్కిరి బిక్కిరై, మతిభ్రమణలు చెందకుండా, ఆకలి చావులతో చావకుండా నగరవ్యాప్తంగా ఇంకా ఉద్రిక్తతలు తొలగనప్పటికీ... ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ కర్ఫ్యూ సడలింపబడింది.

ఓహ్! మూడు గంటల వెసులుబాటు!

మూడు గంటలు అతి తక్కువ సమయం కావొచ్చు. కాని అది జనసముద్రా నికి జీవన ప్రసాదం. అంధకార బంధురంలో ఊపిరిచ్చే వెలుగు. చితిమంటల గల్లీలో పన్నీరు జల్లు.

కళావిహీనమైన, నిర్జీవమైన నగర వీధులు కలకల్లాడుతూ తిరిగి జీవం పోసుకున్నాయి.

నిత్యావసర సరుకుల కోసం, కూరగాయాల కోసం జనం ఎగబడుతున్నారు. వర్తకులు ఎంత రేటు చెబితే అంత రేటుకి కొనేస్తున్నారు. రోగులు వైద్యం కోసం పరుగెడుతున్నారు.

కూలీలు, హమాలీలు, చేతి రిక్షాలు, ఆటో రిక్షాలు... ఆ మూడు గంటల్లోనే ఎంతో కొంత సంపాదించి, వచ్చే పైసలతో కలో గంజో తాగి, ప్రాణాలు నిలుపుకో వడానికి పరుగులు తీస్తున్నారు.

ఎవరో రాజకీయ నాయకుడు మీడియా ముందు మందస్మిత వదనంతో ఉచితంగా బియ్యం పంచిపెడుతుంటే చేతులు చాస్తూ జనాలు ఎగబడుతున్నారు.

జరీనా వలె ఎంతోమంది ఏ పనులుమీదో నగరానికొచ్చి ఇరుక్కుపోయిన వాళ్లు తమ వూళ్లకు పరుగు తీస్తున్నారు. మళ్లీ సూర్యోదయాలను చూస్తామో లేదో, ఈ అపూర్వ అవకాశం మిస్ కొట్టేస్తే... ఇంకెన్ని పగళ్లు, రాత్రుళ్లు చితి నెగళ్లుగా మారుతాయో, రాక్షసమూక రక్త వసంతాలు ఇంకెంతగా చిందిస్తాయో నన్న భయాందోళనలతో ఆదరా బాదరాగా హైదరాబాద్ నుంచి పారిపోతున్నారు.

జరీనాకు ఎంత ఆనందంగా ఉన్నదంటే... అప్పుడే ఆమె ఎక్కవలసిన రైలు ఇంటి ముందు కొచ్చేసినట్లు, శిశిరం నుంచి వసంత మార్గంలో ప్రయాణిస్తు న్నది.

ఆమె బయల్దేరడానికి బురఖా ధరించి మరీ సిద్ధంగా ఉంది. బ్రహ్మాజి ఆటో తీసుకురావడానికి వెళ్లేడు. వెళుతూ ఆమెను హెచ్చరించేడు. పరిస్థితులు

బాగోలేవు గనుక ఇంటి లోపల నుంచి బయటకు రావొద్దన్నాడు.

ఆటో తీసుకువచ్చేడు బ్రహ్మాజి.

జరీనా గుండె ఒక్కసారిగా బరువయింది. కన్నీళ్లు వచ్చేయి.

అప్పటికే తను అతని ఫొటో, కుటుంబ సభ్యుల ఫొటో తీసుకుంది. ఎడ్రసు వివరంగా తెలుసుకుంది. రాసుకుంది.

"స్వామిదేవోభవ" అని కృతజ్ఞతలు తెలియజేసి, చేతులెత్తి నమస్కరిస్తూ "స్వామీ, మీరు శబరిమలై వెళ్లిరండి. మీరు వచ్చిన వెంటనే నేను తప్పక కలుస్తాను. కలిసి మీరు కోరిన విధముగా మీ రుణం కచ్చితంగా తీరుస్తాను" అన్నది హృదయపూర్వకంగా జరీనా.

"మాతా! అంతమాటలొద్దు. రాత్రి మీపట్ల నా ప్రవర్తనకు క్షమించండి. దేవుడు నా దీక్షలో ఒక దేవతను ప్రవేశపెట్టి నన్ను పరీక్షించాడనిపిస్తోంది. వెన్నెల వెలుగులో, పసిబిడ్డకు తల్లి పాలబువ్వ పెట్టినట్లు...నాకీ నాలుగైదు రోజులు కైంకర్యం పెట్టిన ఒక మహామాత మీరు. తల్లిని ఎలా మరువగలను? మాతా! మీరు వెళ్లేక క్షేమంగా చేరినట్లు ఉత్తరం రాయడం మర్చిపోవద్దు, మళ్లీ వస్తానన్నారు. తప్పక రండి మాతా! మీరొక్కరు కాదు. మీ బిడ్డను ఎత్తుకుని, మీ శ్రీవారితో కలసి రావాలి" అంటున్న బ్రహ్మాజి... అంతలో సర్‌మని ఒక స్కూటర్ తమవైపు దూసుకురావడం గమనించేడు.

వాళ్లు నిన్న రాత్రి వచ్చిన దుండగులే!

స్కూటర్ వెనుక సీట్లో కూర్చున్నవాడు మశూచికపు మచ్చలవాడు, గద్దముక్కు గుండుగాడు. వాడి చేతిలో కసాయి కత్తి ఒక మెరుపులా దూసుకువస్తోంది.

జరీనాను తప్పుకోమని చెప్పే సమయం అతనికి అరక్షణమైనా లేదు. హఠాత్తుగా ఆమెను గుండెల్లో దాచేసుకుని, గట్టిగా చుట్టేసుకుని ఆమెకు కవచంలా నిలిచేడు బ్రహ్మాజి.

ఆమె గుండెల్లో కసక్కున దిగిపోవాల్సిన కత్తి, అతని కుత్తుకలో బలంగా దిగిపోయింది.

రక్తపు మడుగులో ఇద్దరూ కుప్పకూలిపోయేరు.

భీతితో, భయోద్విగ్నతతో కెవ్వుమని కేకవేసి సొమ్మసిల్లి పోయింది జరీనా.

అక్కడికక్కడే చనిపోయేడు బ్రహ్మాజి.

అతని కౌగిలిలోనే బిగిసుకుపోయి ఉండిపోయింది జరీనా.

మతవిద్వేష హాలాహలం పొగలు, సెగలు కక్కి బ్రహ్మాజిని బలి తీసుకుంది.

అతని హత్య... మతకలహాల మృతుల సంఖ్య ఏ నెంబరుకి పెరిగిందో లెక్కకే పరిగణనలోకి తీసుకోబడింది తప్పా ఎవరిపై,ఏ సంస్థపై ఎటువంటి హత్యా నేరం మోపబడలేదు. ప్రభుత్వంతో సహా ఎవరూ దోషిగా బోనులో నిలబడలేదు.

***

బ్రహ్మజి ఏ విధంగా బలిదానమయ్యి తనకు ప్రాణభిక్ష పెట్టిందీ కోడలితో చెప్పుకొని ఏడ్చింది జరీనా.

రెండేళ్లక్రితం చనిపోయిన తాగుబోతు భర్త ఆమెకు గుర్తుకురాడు. గుర్తుకు వచ్చినా ఏడుపు రాదు.

పాతికేళ్ల క్రితం మృతిచెందిన బ్రహ్మజిని, స్వామిజీని, తన దేవుణ్ణీ మరిచి పోలేదు. ఎలా మర్చిపోగలదు?

చెప్పిన కథంతా విన్న తర్వాత, అత్తగారిని ఎలా ఓదార్చాలో తెలియలేదు ఫాతిమాకి.

తర్వాత -

హాలులో గోడకు వేలాడుతున్న బ్రహ్మజి ఫొటోను తన చేతుల్లోకి తీసుకుంది. తీసుకొని బజారుకి వెళ్లింది. ఫొటో స్టూడియోలో ఆ పాత ఫొటోని ఒక కొత్త ఫొటోగా మార్పించి, మంచి లుక్ తీసుకు వచ్చింది. ఆ ఫొటోకి లామినేషన్ చేయించి, ఇంటికి తీసుకువచ్చి, అత్త చేతిలో పెట్టి, 'ఎలా ఉంది?' అన్నట్టు చూసింది ఆమె కళ్లల్లోకి ఫాతిమా.

జరీనా కళ్లు జలపుష్పాలయ్యేయి.

కోడలి చేతులను కృతజ్ఞతాపూర్వకంగా పట్టుకుంది.

కోడల్ని హృదయపూర్వకంగా గుండెలకు హత్తుకుంది.

"అత్తమ్మా! ఈ ఫొటో హాలులో కాదు.మీ గుండెల్లో ఉండాలి. లేదా మీ గది లో ఉండాలి" అంటూ ఆ ఫొటోని జరీనా గదిలో దేవుడి మూలన అలంకరించింది.

ఆవిధంగా జరీనాని సంతోషపెట్టింది ఫాతిమా.

అదే సమయంలో భర్త అన్వర్‌ని కూడా సంతోష పెట్టింది ఫాతిమా.

"ఇపుడా దరిద్రపు ఫొటో హాలులో ఒక దిష్టిబొమ్మలా, జిడ్డు మరకలా లేకుండా, హాలు డీసెంట్‌గా ఉంది. నా డార్లింగ్‌కి ఎవరికి ఎలా చెప్పాలో, ఏది ఎక్కడ వుంచాలో స్పష్టంగా తెల్సు. కంగ్రాట్స్" అంటూ ఫాతిమాని దగ్గరకు తీసుకున్నాడు అన్వర్.

*(రచన - డిసెంబర్ 2010)*